పదింతల పట్టుదలతో...

- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై అధిక శ్రద్ధ
- ప్రణాళికలు అమలు చేస్తున్న హెచ్‌ఎంలు
- శత శాతం ఫలితాలపై దృష్టి
- క్లస్టర్ పరిధిలో పరీక్షలకు 5,101 మంది పది విద్యార్థుల హాజరు


పదో తరగతి విద్యార్థులు

రాయవరం: విద్యార్థి దశలో పదో తరగతి కీలకమైంది. ఉన్నత చదువులు, ఉద్యోగం ఇలా జీవితంలో ఉన్నత స్థితికి చేరాలంటే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. అందుకే పదో తరగతి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కృషి చేస్తున్నారు. విద్యార్థులు కూడా మంచి మార్కులు తెచ్చుకోవాలనే పట్టుదలతోనే చదువుతున్నారు. పలు పాఠశాలలు శత శాతం మార్కులు సాధించేందుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారు. ప్రతి రోజు పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ఇంకొంచెం శ్రద్ధ పెట్టి చదివిస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో ఇలా

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 94 ఉన్నత పాఠశాలలున్నాయి. క్లస్టర్ పరిధిలో 5,101 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనుండగా, మండపేట నియోజకవర్గంలో 3,017 మంది, రామచంద్రపురం నియోజకవర్గంలో 2,084 మంది పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 29 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు.

ప్రైవేటుకు దీటుగా..

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాయి. దీనికి విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు తాము ఏ మాత్రం తీసిపోమనీ నిరూపిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలనే లక్ష్యంతో జూలై నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని, వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

ఇలా చేస్తే మంచిది...

- ప్రతి సబ్జెక్టులో ప్రధానమైన పాఠాలను బాగా చదవాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి.
- కఠినమైన పదాలకు అర్థాలను నోటు పుస్తకంలో రాసుకోవాలి. ఉపాధ్యాయులు సూచించిన ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యం.
- ఒత్తిడికి దూరంగా ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతతో చదవాలి. రాత్రి ఎక్కువ సమయం నిద్ర మేల్కొని చదవడంతో ఫలితం ఉండదు. దీంతో పరీక్షల సమయంలో ఎక్కువగా అలసిపోతారు.

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	పరీక్షా కేంద్రాలు
రాయవరం	13	689	04
రామచంద్రపురం	32	1,626	09
కె.గంగవరం	11	458	04
మండపేట	28	1,877	09
కపిలేశ్వరపురం	10	451	03
మొత్తం	94	5,101	29

- కష్టంగా ఉన్న సబ్జెక్టులను వేకువజామున చదివితే మెదడు ప్రశాంతంగా ఉండి బాగా గుర్తుంటాయి.
- ఇంత వరకు జరిగిన సమ్మెటివ్-1, ఫార్మేటివ్ పరీక్షల్లో చేసిన తప్పులను సరిచేసుకోవాలి.
- తరగతిలో ప్రతిభావంతులతో స్నేహ పూరితంగా ఉండాలి. వారితో గ్రూపుగా కలిసి చదివితే ఎక్కువ విషయాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది.
- 'సినిమాలు, టీవీలు ఆటలకు పరీక్షలకు ముందు స్వస్తి పలికితే మంచిది.
- పాత ప్రశ్నాపత్రాలను సాధన చేయాలి. అందులోని ప్రశ్నలే ఎక్కువగా రావడానికి అవకాశం ఉంటుంది.

రోజు వారి ప్రణాళికతో...



జిల్లా విద్యాశాఖ ఇచ్చిన రోజు వారి ప్రణాళికను అమలు చేస్తున్నాం. సమ్మెటివ్-1లో మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించాం. నూరు శాతం ఫలితాల సాధనకు తగిన ప్రణాళికను అమలు చేస్తున్నాం. **– గుణ్ణం అచ్యుతరామయ్య,** జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు), ద్వారపూడి, మండపేట మండలం

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి



వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గతేడాది ఫలితాలను బేరీజు వేసుకుని, గతంలో అనుసరించిన విద్యా విధానాలతో ముందుకు సాగుతున్నాం. ఈ ఏడాది కూడా నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం. **– విత్తనాల సుబ్బారావు,** జీహెచ్‌ఎం, మున్సిపల్ ఉన్నత పాఠశాల, రత్నంపేట, రామచంద్రపురం

నిరంతర పర్యవేక్షణ



పదవ తరగతి ఫలితాల్లో రామచంద్రపురం డివిజన్ పరిధిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నాం. ప్రధానోపాధ్యాయులతో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా, ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. **– శ్రీపాద నరసింహ ఫణి,** ఉప విద్యాశాకాధికారి, రామచంద్రపురం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పృథ్వీరాజ్

రాయవరం: సోమేశ్వరంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ శుక్రవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన మట్టా ఏసురాజు తాటాకిల్లు తారాజువ్వ పడి అగ్నికి ఆహుతైన విషయం పాఠకులకు విదితమే. స్థానిక సర్పంచ్ ఆరిఫ్, స్థానిక నేతలతో కలిసి ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన ఆర్థిక సాయాన్ని అందించేలా కృషి చేస్తానని, కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పృథ్వీరాజ్ వెంట ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సోమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, వార్డు సభ్యుడు శాకా ఫణీంద్ర, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు శాకా నాగు, మద్దిల వాసు, నాగదేవర తాతాజీ, శాకా అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


రాయవరం పరీక్షా కేంద్రం వద్ద ఉన్న విద్యార్థులు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు తెలుగు పరీక్షను రాశారు. పరీక్షా కేంద్రానికి ఎనిమిది గంటలకే చేరుకున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులకు చెందిన 65 మంది తెలుగు పరీక్ష రాయాల్సి ఉండగా, 54 మందే రాశారు. 11 మంది గైర్హాజరయ్యారు. అలాగే 128 మంది సంస్కృతం విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 126 మంది పరీక్షలకు హాజరు కాగా, ఇద్దరి విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డీవీవీ నాగేశ్వరరెడ్డి, డీవో సత్యనారాయణల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు మధ్యాహ్నం 12గంటల వరకు జరిగాయి. ఇదిలా ఉంటే శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

రామచంద్రపురం: ఇంటర్మీడియెట్ పరీక్షల మొదటిరోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 422 మందికిగాను 390 మంది విద్యార్థులు హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారు. మోడరన్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 316 మందికి 11 మంది గైర్హాజరు 305 మంది హాజరయ్యారు. వికాస్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 317 మందికి 14 మంది గైర్హాజరు కాగా 303 మంది, నారాయణ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 177 మందికి నలుగురు గైర్హాజరు కాగా 173 మంది పరీక్షలు రాశారు. వీఎస్‌ఎం జూనియర్ కళాశాలలో 402 మందికి 10 మంది గైర్హాజరు కాగా 392 మంది పరీక్షకు హాజరయ్యారు. పట్టణంలోని పరీక్ష కేంద్రాల వద్ద రామచంద్రపురం సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో ఎస్సై కె.సురేష్‌బాబు పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కాజులూరులో 30 మంది గైర్హాజరు

కాజులూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 269 మంది విద్యార్థులకు గాను 30 మంది గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు మంచినీరు తదితర వసతి సదుపాయాలు కల్పించామన్నారు. శనివారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయని విద్యార్థులు అర్ధగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన


వీఎస్ఎం కళాశాలలో ఏర్పాటు చేసే తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న ఆర్డీవో సుధాసాగర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

రామచంద్రపురం: త్వరలో జరగబోయే ఎన్నికలకు సంబంధించి స్థానిక వీఎస్‌ఎం కళాశాలలో బీ బ్లాక్ నందు తాత్కాలిక స్ట్రాంగ్ రూంలను ఆర్డీవో ఎస్.సుధాసాగర్ నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్స్, పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు, ఎన్నికలు జరిగే ముందు రోజు వరకు ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ మొదలైన కార్యక్రమాలకు సంబంధించి కళాశాల తరగతి గదులను ఆర్డీవో పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో గదులను స్వయంగా పరిశీలించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేయగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎటువంటి అభ్యంతరాలు తెలపలేదని ఆర్డీవో తెలిపారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత ఇంత సంతోషం, జనసేన నాయకులు శ్రీహరి పంతులు, కాంగ్రెస్ పార్టీ నేత ఆర్‌డీ ఖాన్, తదితర పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్‌లు, రామచంద్రపురం సీఐ పి.దొరరాజు, ఎస్సై కె.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం ఈఓపీఆర్‌డీగా కొండలరావు


ఎం.రామకృష్ణారెడ్డికి వీడ్కోలు పలుకుతున్న పరిషత్ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: మండల ఈఓపీఆర్‌డీగా ఏవీవీఎస్ ఆర్‌ఎస్ కొండలరావు నియమితులయ్యారు. ఉండి మండల పరిషత్ కార్యాలయంలో ఈఓ పీఆర్‌డీగా పనిచేస్తూ బదిలీపై కపిలేశ్వరపురం వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఈఓపీఆర్‌డీగా పని చేసిన ఎం.రామకృష్ణారెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎం.రామకృష్ణారెడ్డి కపిలేశ్వరపురం ఎంపీడీఓగా విధులను నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణారెడ్డికి శుక్రవారం వీడ్కోలు పలికారు. ఆయన హయాంలో గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేశారని వారు ప్రశంసించారు.

వైఎస్సార్ సీపీది పేదల ప్రభుత్వం

కోఆర్డినేటర్ సూర్యప్రకాష్


సూర్యనగర్‌లో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్

రామచంద్రపురం: ప్రజా ప్రస్థానం యాత్ర ద్వారా ప్రజల కష్టాలను మనస్సుతో చూసిన జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నవరత్నాలతో పాటు పేదల కష్టాలను తీర్చారని, ఇచ్చిన హామీలను అమలు చేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని నాలుగోవార్డు సూర్యనగర్‌లో ఆయన ఇంటింటా పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. కాలనీల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించటంతో పాటుగా ఈ రాష్ట్ర అభివృద్ధిలోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా ముందుకు తీసుకువెళ్లిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా జన్మభూమి కమిటీలు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను అందించిన ప్రభుత్వమిదన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు అవసరమైన అన్ని సేవలను వలంటీర్ల ద్వారా ఈ ప్రభుత్వం అందించిదన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు సమగ్రంగా అంది పేదలు సుభిక్షంగా ఉండాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఏరియా ఆసుపత్రి డైరెక్టర్ తొగరు మూర్తి, స్థానిక వార్డు కౌన్సిలర్ పాలకుర్తి శ్వేత పావని మధు, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు వాడ్రేవు సాయి ప్రసాద్, నల్లా అంజమ్మ, వార్డు నాయకులు మానేపల్లి సూరిబాబు, కొమ్మిరెడ్డి నాగేశ్వరరావు, దార్ల శ్రీను, వలంటీర్లు గృహసారథులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో జిల్లా కోర్టు మంజూరు


మంత్రి వేణును కలసి కృతజ్ఞతలు తెలిపిన బార్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు, న్యాయవాదులు

రామచంద్రపురం: రామచంద్రపురం కోర్టుల ప్రాంగణంలో జిల్లా కోర్టు బెంచ్ మంజూరైనట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీ మోహన్, వాడ్రేవు సాయిప్రసాద్‌లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణకు ఆయన స్వగృహంలో శుక్రవారం కలిసిన బార్ అసోసియేషన్ కార్యవర్గం, న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ ఎంతో కాలంగా రామచంద్రపురం నియోజకవర్గ పరిసర ప్రాంతాల ప్రజల చిరకాల కోరికను తీర్చి ఇచ్చిన హామీ నెరవేర్చినందుకు మంత్రి వేణుగోపాలకృష్ణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు రాష్ట్ర హితకారిణి సమాజం సభ్యుడు దొమ్మలపాటి సత్యనారాయణ, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీఎస్ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఎస్‌వీ రెడ్డి, కోశాధికారి జేఎస్ఎస్ చక్రవర్తి, సీనియర్ న్యాయవాదులు వాకలపూడి జయశంకర్, సాలగ్రామ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, చోడి జాన్‌రత్నం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్వహణ శాస్త్రీయబద్ధంగా ఉండాలి


కేదారిలంక స్కూల్‌ను పరిశీలిస్తున్న మధుసూదనరావు, రాంబాబు

కపిలేశ్వరపురం: ప్రభుత్వ పాఠశాల నిర్వహణ శాస్త్రీయబద్ధంగా ఉండాలని సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ జిల్లా కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు అన్నారు. కేదారిలంక ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యా బోధన తీరును, విద్యార్థుల విద్యా స్థాయిని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలను మెరుగుపర్చిన తీరును హెచ్‌ఎం మాతా ప్రసాదరావు వివరించారు. ఆర్వో ప్లాంట్ పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంను ఆదేశించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని మధుసూదనరావు ఆదేశించారు. ఆయన వెంట అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోండి

రాయవరం: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని రాయవరం ఎస్సై జి.నరేష్ పిలుపునిచ్చారు. కురకాళ్లపల్లిలో శుక్రవారం ఆయన సాధారణ ఎన్నికలు-2024పై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో పవిత్రమైందన్నారు. ఓటు హక్కును సక్రమంగా, సమర్థవంతంగా, నిజాయతీగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందన్నారు. ఎన్నికలకు ఎటువంటి విఘాతం కలగకుండా ఉండేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేస్తుందన్నారు.

పంచాయతీ అవకతవకలపై విచారణ

రాయవరం: పసలపూడి పంచాయతీలో ఆర్థిక అవకతవకలు జరిగినట్టుగా అదే గ్రామానికి చెందిన చింతా తమ్మిరెడ్డి స్పందనలో ఫిర్యాదు నేపథ్యంలో శుక్రవారం డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ విచారణ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన విచారణకు చింతా తమ్మిరెడ్డితో పాటు పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన వివిధ రకాల బిల్లులకు సంబంధించి అప్పటి పంచాయతీ కార్యదర్శులు అవకతవకలకు పాల్పడినట్లు తమ్మిరెడ్డి జిల్లా అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణాధికారిగా డ్వామా పీడీని నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విచారణ అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డ్వామా పీడీ తెలిపారు.

క్లుప్తంగా

తాళ్లపొలంలో ఎంపీ బోస్ పర్యటన


ఎంపీ బోస్‌ను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్‌గా ఉన్న తన కుమారుడు పిల్లి సూర్యప్రకాష్‌కు మద్దతు కూడగట్టడం కోసం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మండలంలోని తాళ్లపొలంలో శుక్రవారం పర్యటించారు. చిన్నతాళ్లపొలం, నవరత్నాలగరువు, తొగరువారి సావరం, అడపావారి సావరం, పెద్ద తాళ్లపొలం, కంచి పేట గ్రామాల్లో శెట్టిబలిజ పెద్దలను, గ్రామ పెద్దలను కలసి వైఎస్సార్ సీపీ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టా గోవిందు, ఉప సర్పంచ్ వల్లు శివ, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, నాయకులు బొంతు బాలరాజు, పంపన రాంబాబు, దోనిమూడి శ్రీను, పితాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రంథాలయం ప్రారంభం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్సీ తోట పర్యటించనున్నారు.

3న ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ సంఘం ఎన్నికలు

రామచంద్రపురం: ఏపీ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు ఆదేశాల మేరకు ఈనెల 3న జరిగే రామచంద్రపురం డివిజన్ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ సంఘం ఎన్నికలను నిర్వహించేందుకు తనను ఎన్నికల అధికారిగా నియమించినట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘం అధ్యక్షుడు సవరపు చిన పాపారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామచంద్రపురం పట్టణంలోని ముద్దాడ రవిచంద్ర ఐఏఎస్ భవనం నందు ఈనెల 3న ఉదయం 9 గంటల నుంచి జరిగే ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించుటకు సభ్యులు హాజరై సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం

కె.గంగవరం: మండలంలోని సత్యవాడలో పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయం వద్ద పునః శివలింగ ధ్వజ చండేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభించారు. ఉదయం నుంచి వేదపండితులు యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య బ్రహ్మత్వంలో పలు ప్రత్యేక పూజలతో పాటు హోమాలు నిర్వహించారు. దేవస్థాన ప్రెసిడెంట్ సలాది వీరాంజనేయులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఆలయం వద్ద ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతాయన్నారు. ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ చేసి అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహిస్తామన్నారు. సలాది వీర వెంకట సుబ్బారావు, సలాది ప్రకాష్‌రావు, సలాది రాంబాబు, బండారు బద్రి, మేడిశెట్టి నాగబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయండి

కాజులూరు: మండల గ్రామాల్లో ఆదివారం జరుగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి పల్స్‌పోలియోపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గొల్లపాలెం, దుగ్గుదుర్రు పీహెచ్‌సీల పరిధిలోని 26 గ్రామాల్లో 2190 మంది ఐదేళ్ల లోపు వయసు గల చిన్నారులు ఉన్నారని వీరికి 2800 డోసులు పోలియో వ్యాక్సిన్ సిద్ధం చేశామన్నారు. ఉదయం 8 గంటల చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తారన్నారు.

ఉపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాలు

కె.గంగవరం: గతేడాది మండలంలోని పలు పాఠశాలల్లో విజయవాడకు చెందిన అరబిందో సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మండలానికి చెందిన విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. దీంతో గురువారం రాత్రి విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు మంచి మార్కులు సాధించడానికి తర్ఫీదు ఇచ్చిన ఎంఈఓ నాగరాజు, హెచ్‌ఎం పుల్లయ్య, కేఆర్‌కే ప్రసాద్, జి.శ్రీనివాసరావు, ఎల్లయ్య, వర్మ ఉపాధ్యాయులకు అరబిందో సొసైటీ సభ్యులు మెమెంటోతో పాటు ప్రతిభా పురస్కారాన్ని అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలం శివారు అడపా వారి సావరంకు చెందిన అడపా సత్యనారాయణ(55) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ద్రాక్షారామ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడపా సత్యనారాయణ వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. అతడికి మానసిక స్థితి సరిగా లేని భార్య, ఇంజినీరింగ్ చదువుతున్న కుమారుడు ఉన్నాడు. శుక్రవారం కూలీ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి లారీ తలపై నుంచి వెళ్లడంతో మృతి చెందాడు. ద్రాక్షారామ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ బోస్ కలసిన 'గొల్లపల్లి'


వెల్లలో ఎంపీ బోస్‌ను కలసిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

రామచంద్రపురం రూరల్: మాజీ మంత్రి, సీనియర్ దళిత నాయకుడు గొల్లపల్లి సూర్యారావు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని వెల్ల గ్రామంలో ఎంపీ బోస్ గ్రామ పెద్దలను, పార్టీ శ్రేణులను కలుస్తున్న సందర్భంగా గొల్లపల్లి తన అనుచరులతో కలసి వచ్చారు. వైఎస్సార్ సీపీలో చేరినందుకు ఎంపీ బోస్ ఆయనను అభినందించారు. నియోజకవర్గ పార్టీ నాయకులను ఎంపీ బోస్ గొల్లపల్లికి పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, పార్టీ నాయకులు పంతగడ విజయప్రసాద్, వట్టికూటి ఏసుబాబు, తోట వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి వలంటీర్ల క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వలంటీర్లు

రామచంద్రపురం రూరల్: వలంటీర్లకు వందనం ద్వారా వలంటీర్లకు ఈ ఏడాది రూ.15 వేలు అందించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని వెంకటాయపాలెం వలంటీర్లు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. సేవ ద్వారా తమకు సమాజంలో మంచి గుర్తింపు వచ్చిందని, ప్రతి ఒక్కరూ తమను తమ కుటుంబ సభ్యుల్లా చూస్తూ గౌరవిస్తున్నారన్నారు. ప్రభుత్వ సేవలను అర్హులకు అందించడం ఎంతో సంతృప్తి ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యలమిల్లి సతీష్‌కుమారి, ఉప సర్పంచ్ గంధం బుజ్జి, సచివాలయ కన్వీనర్ దడాల రవికుమార్, ఏపీఎండీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వీఆర్‌ఓ వాసంశెట్టి శ్రీరామకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి


ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రసంసా పత్రాలు అందించిన సర్పంచ్ లక్ష్మీనరసమ్మ తదితరులు

కె.గంగవరం: ప్రతి విద్యార్థి సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన బోధన అందించే ఉపాధ్యాయులు ఉన్నారని వారు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను ఆసక్తిగా పరిశీలించి వారిని అభినందించారు. సైన్స్‌డే సందర్భంగా విద్యార్థులకు క్విజ్, సైన్స్ ముగ్గులు, నాటికలు వేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్‌ఎం వెంకటేశ్వరరావుతో కలిసి మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందించారు. సైన్స్ ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, ఉపాధ్యాయులు శ్రీధర్, రామలక్ష్మి, నందూరి భీమరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పన్నులపై వడ్డీ రాయితీ

రామచంద్రపురం: పురపాలక సంఘంలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లింపుదారులకు బకాయిల చెల్లించేందుకు వడ్డీరాయితీని ప్రభుత్వం ప్రకటించినట్లు కమిషనర్ బి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 సంవత్సరానికి రెండో అర్ధ సంవత్సరం వరకు పన్నులు చెల్లించని వారికి వడ్డీ లేకుండా చెల్లించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈనెల 31 లోపు కార్యాలయంలోని కౌంటర్ నందు గానీ, సమీపంలోని సచివాలయంలో సెలవు దినాల్లో కూడా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి.. పింఛను అందజేత


రాజమహేంద్రవరంలో పింఛను అందజేస్తున్న ద్వారపూడి వలంటీర్

కపిలేశ్వరపురం: ద్వారపూడి సచివాలయం వలంటీర్ లంక లోవకృష్ణ శుక్రవారం తన పరిధిలోని లబ్ధిదారుకు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి పింఛను సొమ్మును అందజేశారు. ద్వారపూడికి చెందిన టేకి బుచ్చెమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకున్న వలంటీర్ లోవకృష్ణ రాజమహేంద్రవరం వెళ్లి పింఛను అందజేశారు.